


తిరుపతి డిఎంహెచ్వో గా బాలకృష్ణ నాయక్



ప్రజాశక్తి - తిరుపతి తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ ను ప్రభుత్వం నియమించింది. తిరుపతి డిఎంహెచ్వో గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీహరిని విశాఖపట్నం కేజీహచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. డాక్టర్ శ్రీహరి ఇప్పటికే అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడం, అర్హత లేకపోయినా పదవిలో కొనసాగడంపై చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆయనపై విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయనపై బదిలీ వేటు వేయడం గమనార్హం. విచారణ అధికారులు సైతం డాక్టర్ శ్రీహరికి వ్యతిరేకంగా పలు ఆధారాలతో నివేదికను వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుతం నగిరి నియోజకవర్గ ఏరియా ఆసుపత్రి సిఎస్ఆర్ ఎమ్ఓ గా పనిచేస్తున్న డాక్టర్ బాలకృష్ణ నాయక్ ను తిరుపతి డిఎంహెచ్వో గా నియమించింది.

'వన' చైతన్య 'రహితం'



టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో 'రథం'
శేషాచల పరిసరాల్లో ప్రచారమేది?
యథేచ్ఛగా ఎర్రచందనం స్మగ్లింగ్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శేషాచలం అడవుల్లో మాత్రమే లభ్యమయ్యే అరుదైన ఎర్ర బంగారాన్ని అక్రమంగా తరలించకుండా అటవీ సమీప ప్రాంతాల్లో ప్రచారం చేయాలనుకున్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడితే ఎటువంటి శిక్షలు పడతాయో లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నది ముఖ్య ఉద్దేశ్యం. అయితే 'వన చైతన్య రథం' ప్రస్తుతం కపిలతీర్థం వద్ద టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఓ మూలన దుమ్ము కొట్టుకుపోయి చైతన్య రహితంగా 'ప్రజాశక్తి'కి కనిపించింది.

దశాబ్దాల కాలంగా శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోంది. రాజకీయ, అధికార పలుకుబడితో టన్నులకొద్దీ ఎర్రచందనం దుంగలను విదేశాలకు ఎగుమతి చేస్తూనే ఉన్నారు. కోట్లాది రూపాయలను స్మగ్లర్లు గడిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నా స్మగ్లింగ్‌ను పూర్తిస్థాయిలో నిరోధించలేకపోయారన్నది వాస్తవం. ఇంటిదొంగల ఊతం స్మగ్లర్లకు సూపర్‌గా ఉందన్నది జగమెరిగిన సత్యం. ఈ కారణంగానే ఎర్రచందనం స్మగ్లింగ్ మూడు దుంగలు.. ఆరు వాహనాలు అన్న చందంగా యథేచ్ఛగా సాగుతోంది. ఓ రకంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రాజకీయాలను సైతం శాసించే స్థాయికి స్మగ్లర్లు ఈ దశాబ్దకాలంలో ఎదిగారన్నది వాస్తవం. గతంలో అటవీ శాఖామాత్యులు ఈ జిల్లాలోనే దశాబ్దాలుగా ఉన్నా స్మగ్లింగ్ రెట్టింపయ్యిందే తప్ప, నివారించలేక పోయారన్న విమర్శలు లేకపోలేదు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు 2014లో అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడు అధికారులతో సమాలోచన చేసి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. తిరుపతి కేంద్రంగా ఈ టాస్క్‌ఫోర్స్ కేంద్ర కార్యాలయం పనిచేస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు అయింది. ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడానికి పోలీసు బలగాలు, అటవీ శాఖ, పోలీసు శాఖ నుండి సిబ్బందిని ప్రభుత్వం సమకూర్చింది. వీరందరికీ సారథి ఐజి స్థాయి అధికారిని నియమించినపుడే ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించిన ప్రభుత్వం ఐపీఎస్ ఆఫీసర్ కాంతారావును టాస్క్ ఫోర్సు సారథిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన మాగంటి కాంతారావు ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడానికి తనదైన వ్యూహాలను అనుసరించారు.

వినూత్న ప్రచారానికి శ్రీకారం

శేషాచలం దట్టమైన అడవులలో ఎర్రచందనం చెట్లను నరికి వాటిని దుంగలుగా మలచి అడవి నుండి బయటకు తీసుకువచ్చే వారిలో పరివర్తన తీసుకురావాలని వినూత్న ప్రయత్నానికి కాంతారావు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా టాస్క్ ఫోర్స్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ఎర్రచందన వన చైతన్య రథము తయారు చేయించి అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలలో టాస్క్ ఫోర్స్ సిబ్బందిచే ఎర్రచందనం అక్రమ రవాణాకు అడవులకు వస్తే ఎలాంటి శిక్షలు పడతాయి, ఆ శిక్షలు వలన వారి కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను లఘు చిత్రాల ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు వివరించారు. ఎక్కడైనా ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800-425-00-425 ను అక్కడి ప్రజలకు ఇచ్చి వారిచ్చిన సమాచారంతో ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న దాఖలాలు అప్పట్లో ఉన్నాయి. కొంతమేర అడవికి వచ్చే కూలీల్లో, స్మగ్లర్లలో కొంతమేర మారుప తీసుకొచ్చారు. అయితే 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చాక టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు మాగంటి కాంతారావును ప్రభుత్వం తూనికలు కొలతల శాఖ ఐజిగా బదిలీ చేసింది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ ప్రచార చైతన్య రథం కదలిక లేకుండా కపిలతీర్థం వద్ద ఉన్న టాస్క్‌ఫోర్స్ కేంద్ర కార్యాలయం ఆవరణలోనే ఉండిపోయింది.

కూటమి హయాంలోనైనా...

ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడంలో ఎంతోకొంత మార్పు తీసుకొచ్చిన ప్రచార రథాన్ని ప్రస్తుత టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు పున్హ ప్రారంభిస్తారా అన్న విషయాన్ని వేచి చూడాలి.

కూలీల కొరత... రైతుల కలత..!

- ముమ్మరంగా రబీ సీజన్ వరి నాట్లు
- రెట్టింపు కూలి ఇస్తామన్నా రాని వైనం

ప్రజాశక్తి - డక్కిలి

వెంకటగిరి నియోజకవర్గంలో వ్యవసాయ కూలీల కొరత రైతులను వేధిస్తోంది. వరి నాట్లు పెట్టే కాలం కావడంతో కూలీలకు డిమాండు పెరిగింది. నియోజకవర్గ జనాభా 3,62,148 మంది. ఇందులో సుమారు ఒక లక్ష మంది మాత్రమే వెంకటగిరి , రాపూర్ వంటి పట్టణాల్లో నివసిస్తున్నారు. మిగతా జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తోంది. వీరికి వ్యవసాయమే ఆధారం. వీరికి చిన్ననీటి వనరులే దిక్కు కావడంతో వర్షాధారంపై మినుము, వేరుసెనగ, వరి పంటలు సాగు చేస్తుంటారు. ఇపుడు అన్ని చోట్లా వరి నాట్లు పెడుతుండటంతో కూలీల కొరత నెలకొంది. దీంతో రైతులు నిద్రలేస్తే కూలీల ఇళ్లకు పరుగులు పెడుతున్నారు. అమ్మా తల్లీ అని ప్రాధేపడుతున్నారు. లేదంటే తెలిసిన బంధువుల ఊర్లకు వెళ్లి వాహనాల్లో స్వయంగా కూలీలను తీసుకొస్తున్నారు. నార్లు ముదిరిపోతుండడం, అదను దాటి పోతుందన్న భయంతో అడిగిన మేరకు డబ్బులు ముట్టచెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కొక్క కూలీకి రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు అందజేస్తున్నారు. రైతన్నలకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది. మొదట్లో వంగాళం వడనందున



కృష్ణా జిల్లా నుంచి వలస వచ్చిన కూలీలు

నారుమల్లు ఆలస్యంగా పోసుకున్నారు. ఆ తర్వాత ఈ నెలలో ఎడతెరిపి లేని ముసురు వాన కురిసింది. దీంతో రైతులందరూ ఒక్కసారిగా నార్లు పోసుకోవడంతో కూలీల కొరత ఏర్పడింది. స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో పశ్చిమబెంగాల్ , ఒరిస్సా రాష్ట్రాలతో పాటు కష్ణా జిల్లా నుంచి కూలీలను రప్పించి వరి నాట్లు పనులు సాగిస్తున్నారు. దీంతో సాగు వ్యయం మరింత పెరగనుండటంతో రైతన్నలు కలత చెందుతున్నారు.

కూలీల కొరతకు కారణాలు ఎన్నో...

గడిచిన కొద్ది సంవత్సరాలుగా కూలీ పనులు చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. మారుతున్న కుటుంబ, ఆర్థిక పరిస్థితులే ఇందుకు కారణం. ఒకప్పుడు సగటున అయిదు వందల కుటుంబాలున్న గ్రామంలో సుమారు వంద మంది వరకు మహిళా కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లేవారు. పది నుంచి ఇరవై మంది బందంగా ఏర్పడి పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం అలాంటి బందాలు అరుదుగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటం, విద్యావకాశాలు అందుబాటులో లేక గ్రామీణులు వ్యవసాయ కూలీలుగా వెళ్లేవారు. ప్రస్తుతం కూలీలుగా పని చేస్తున్న వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల్లో స్థిరపడటం పరిశ్రమలు, సేవారంగం, వ్యాపారం వైపు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. దీంతో కొత్త తరం చాలా మంది వ్యవసాయం వైపు రావడం లేదు. ఇప్పటికే పంట సాగులో వైవిధ్యం కోల్పోయి సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్న వ్యవసాయ రంగంపై కూలీల కొరత తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఏదో ఒక రకంగా పంటలు సాగు చేస్తున్న రైతులకు యాంత్రీకరణే దిక్కని గణాంకాలు చెబుతున్నాయి. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్నవారిలో చాలా వరకు వ్యవసాయ పనులకు వెళ్లడం లేదు. ఉపాధి హామీ పనుల్లో శ్రమించాల్సిన సమయం తక్కువ. ఉదయం వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రావచ్చు. వ్యవసాయంలో ఉదయం వెళ్తే సాయంత్రం వస్తున్నారు. అందుకే వ్యవసాయం కన్నా ఉపాధి పనులకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గత్యంతరం లేక రైతులు ఇతర రాష్ట్రాల నుంచి నుంచి కూలీలను రప్పిస్తున్నారు.

శనివారం డక్కిలి మండలంలోని మోపూరు గ్రామంలో రైతు కూలీల మధ్య జరిగిన సంభాషణ ఇది

రైతు : అమ్మ అమ్మ నారు ముదిరిపోతుంది తల్లి... ఎకరాకు రూ. 4500ఇస్తా.. అదనంగా మరో రూ.అయిదు వందలిస్తా, రాను పోను ఆటో ఖర్చులు కూడా నేనే భరిస్తా. కూలోల్లు అందరికీ కూల్ డ్రింక్‌లు సరఫరా చేస్తా.. వరి నాటు పెట్టేందుకు మీ వారందరు రండమ్మా...

కూలీ : అందరూ వేరే ఊరికి వెళదామని నిర్ణయించుకున్నారు. వారి వెంటే వెళ్తా అంటు కూలీలు ఎక్కిన ఆటోలో ఆమె కూడా వెళ్లిపోయింది.

వేడుకగా ఫ్లెమింగో ఫెస్టివల్ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రానున్న జనవరి 2025 నెలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు వారి విధులను, ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జనవరిలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకల నిర్వహణపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ లతో కలిసి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో జిల్లా పర్యాటక కమిటీ చైర్మన్ హోదాలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మత్స్య శాఖ అధికారులు పులికాట్ సరస్సు నందు బోటు ప్రయాణానికి అవసరమైనన్ని బోట్లు, ట్రిప్పులు ఎన్ని నిర్వహిస్తారు అని ప్రణాళిక ఏర్పాటు, విధుల కేటాయింపు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, రోప్ తదితర సామాగ్రి అందుబాటుతో ఎలాంటి ఓవర్ లోడ్ లేకుండా బోటు ప్రయాణంలో అన్ని రకాల జాగ్రత్తలు చేపట్టి, పర్యవేక్షించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, డిఎఫ్ఓ, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, ఏపీటీడీసి




ఈఈ సుబ్రమణ్యం, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో భద్రతా ఏర్పాట్లు : కలెక్టర్

సముద్ర తీర ప్రాంతాల వద్ద భద్రత ఏర్పాట్లను సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాస్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ తొలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కోస్టల్ సెక్యూరిటీ కమిటీ చైర్మన్ హోదాలో మాట్లాడుతూ ఎస్‌పి కోస్టల్ సెక్యూరిటీ పోలీసు, విశాఖపట్నం వారు సూచించిన మేరకు కోస్టల్ పోలీసు స్టేషన్ దుగరాజపట్నంకు సంబంధించి కోస్టల్ సెక్యూరిటీ పోలీసు స్టేషన్, మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధుల అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపుతామన్నారు. జెట్టి నిర్మాణానికి అవసరమైన 48 కోట్ల రూపాయల నిధులను షార్‌వారు ఇస్తామని చెప్పారని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు తమ ఆధార్ కార్డు బయోమెట్రిక్ కార్డు వెంట తీసుకొని వెళ్లేలా చర్యలు చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజును కలెక్టర్ ఆదేశించారు. తూపిలి పాలెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మన రాష్ట్రానికి చెందిన బోట్లు గుర్తించడానికి వాటికి నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ నందు ఖాళీలను భర్తీ కొరకు కోరగా సంబంధిత శాఖలు వారి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వారాంతపు సెలవులలో, పండుగల సందర్భాలలో తగినంత మంది గజ ఈతగాళ్లను బీచ్‌ల వద్ద మెరైన్ పోలీసుల సమన్వయం చేసుకుని ఏర్పాటు చేసి పనిచేసేలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అదనపు ఎస్పీ క్రైమ్ నాగభూషణరావు, అదనపు ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ మధుసూదన్ రావు, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ తిరుపతి సూపరింటెండెంట్ శ్యాంసుందర్ రెడ్డి, కోస్ట్ గార్డ్ అధికారి బేగ్, డిఎస్పి గిరిధర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, మెరైన్ పోలీస్ అధికారులు మాలకొండయ్య పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే దౌర్జన్యంగా ఇళ్లు కూల్చివేత

తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి : కెవిపిఎస్



ప్రజాశక్తి - రేణిగుంట

ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా శ్రీకాళహస్తి ఎంఎల్ఎ ఆదేశాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి దళిత గిరిజనుల ఇళ్లను కూల్చివేసిన తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని ఎపి గిరిజన, కెవిపిఎస్, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అర్ధరాత్రి ఇళ్లల్లోనుంచి మహిళలు బయటకు రాకుండా తాళాలు వేసి ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. హరినాథ్, కె.వి.పి.ఎస్ మండల కార్యదర్శి కె. సెల్వరాజ్, ఆదర్శ మాలల ఐక్య వేదిక తిరుపతి పార్లమెంటు ప్రెసిడెంట్ అంబేద్కర్ నాగరాజు, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల కార్యదర్శి కె. ఈశ్వరమ్మ, సి.పి.ఎం తారకరామనగర్ శాఖ కార్యదర్శి సత్యశ్రీ, రాజశేఖర్ ఈ ఘటనను ఖండించారు. కె హరినాథ్ మాట్లాడుతూ రేణిగుంట మండలంలో తహశీల్దార్ కార్యాలయం పక్కనే ప్రముఖ న్యాయవాది, రాజకీయ పెద్దలు ప్రభుత్వ భూములను స్వాహా చేసి ఒక ఫ్లాట్ 10 లక్షలకు అమ్ముకొని కోట్లు రూపాయలు గడించిన పెద్దమనుషులను వదిలేశారన్నారు. చెంగారెడ్డిపల్లి గిరిజన, దళితులు ఒక్కో ఇంటికి 3 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మించుకున్న 150 ఇండ్లను, కుక్రకాలువ హరిజనవాడ ఇండ్లు లేని నిరుపేద దళితులు నిర్మించుకున్న 60 మంది ఇండ్లను ఎటువంటి సమాచారం - నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో దౌర్జన్యంగా కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. పై రెండు గ్రామాల్లోనూ కూల్చిన స్థలాల్లోనే ఇళ్లను కేటాయించి హౌసింగ్ వారే దగ్గరుండి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత గిరిజనులకు అండగా నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.



శ్రీసిటీలో టొయామా బృందం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యుల ఉన్నత శ్రేణి ప్రతినిధి బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్ చైర్మన్, హొకురికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి ముగినో నేతత్వంలో విచ్చేసిన బందానికి శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు వలన కలిగే వివిధ ప్రయోజనాలను వివరించారు. 30 కు పైగా జపాన్ కంపెనీల ఏర్పాటుతో శ్రీసిటీ దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా అవతరించిందన్నారు. శ్రీసిటీ వ్యాపార సామర్థ్యం అంచనా, పెట్టుబడి అవకాశాలపై ఆసక్తిని కనబరుస్తూ ప్రధానంగా ప్రతినిధి బృందం పర్యటన సాగింది.

సమాజ శ్రేయస్సే జెసిఐ లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సమాజ శ్రేయస్సు కోసం నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ కషి చేస్తుందని తిరుపతి నగర జెసిఐ నూతన అధ్యక్షుడు శేషసాయి తెలిపారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని కరకంబాడి మార్గంలో గల ఓ ప్రైవేటు హోటల్లో జెసిఐ తిరుపతి పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, జెసిఐ జాతీయ ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, జోనల్ అధ్యక్షులు భరత్ కుమార్ హాజరై నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. శేషసాయి మాట్లాడుతూ 1994 నుండి తిరుపతిలో జెసిఐ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ హితానికి పనిచేస్తుందన్నారు. జెసిఐ ఆశయాలకు అనుగుణంగా నూతన కమిటీ సేవా కార్యక్రమాలను చేపడుతుందని హామీ ఇచ్చారు. జెసిఐ తిరుపతి పట్టణ నూతన కార్యదర్శి దిలీప్ కుమార్, కోశాధికారి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

పదో రోజుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ దీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఏపీఎస్ఆర్టీసీ గూడూరు డిపో ఎదుట కండక్టర్, డ్రైవర్లు, అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని కోరుతూ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో డిపో కార్యదర్శి డి.శ్రీధర్, గ్యారేజ్ కార్యదర్శి పి.రమణయ్య కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కే.ఎస్.మన్యం, జి. వి.రమణయ్య, పి.శివకుమార్, కే. కష్ణయ్య, సి.హెచ్.రాము, ఎం.డి. సాదిక్, కే.సురేంద్ర, ఏం.శేషయ్య, సిఐటియు నాయకులు జోగిశివ కుమార్, బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, పి. శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ప్రజానంఘాల నాయకులు కె.ఆర్.దాసరి పాల్గొన్నారు.




విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై విచారించండి

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ భవనంపై నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రస్తుతం వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థి ఘటనపై విచారణ జరిపించాలని పరిశోధక విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సదరు సంఘటనకు సంబంధించిన కారణాలను బయటపెట్టాలని, దీని వెనుక ఎవరి ప్రమేయమైన ఉందేమో అనే విషయంలో తమకు అనుమానం ఉందని, అది ఎంతటి వారైనా ఉపేక్షించకుండా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఒక సబ్జెక్టు ఫెయిల్ చేశారని, అందుకు మనస్థాపం చెందినట్లు తమకు సమాచారం ఉందని, సదరు విషయం పైన లోతుగా విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మధుసూదన్, ప్రసన్న, అంజి నాయక్ పాల్గొన్నారు.

అరణియార్ ప్రాజెక్ట్ చైర్మెన్‌గా డి. రవి



ప్రజాశక్తి - పిచ్చా టూరు

పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్ట్ నీటి సంఘ ఎన్నికలు శనివారం పిచ్చాటూరు ఇరిగేషన్ కార్యాలయం ముందు ఎలక్షన్ అధికారి రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. చైర్మన్‌గా డి. రవిని, వైస్ చైర్మన్గా నాగలాపురం మండలానికి చెందిన విజయ కష్ణను ఎన్నుకున్నారు ప్రశాంతంగా ఎన్నికలకు సహకరించిన అధ్యక్షులకు, పార్టీ నాయకులకు, రైతులకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. క్లస్టర్ ఇంచార్జి ఇలంగోవన్ రెడ్డి, పద్దురాజు, జయచంద్ర నాయుడు, వాసు, శ్రీనివాసులు, ఎం ఎస్ రవి, ఢిల్లీ, దొర వేలు పాల్గొన్నారు.

డ్రైనేజి సమస్య పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ స్వచ్ఛ తిరుపతి స్మార్ట్‌సిటీ పేరుతో అవార్డులు తీసుకోవడం కాదని, డ్రైనేజి సమస్యలేని తిరుపతిగా అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి వేణుగోపాల్ డిమాండ్‌చేశారు. తిరుమల బైపాస్‌రోడ్డులో కొర్లగుంట జంక్షన్ నుంచి మార్కెట్ రోడ్డు వరకూ డ్రైనేజీ నీరు రోడ్డులో ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నా కార్పొరేషన్ వారు పట్టించుకోవడం లేదన్నారు. నెలరోజులుగా దుర్గంధం వెదజల్లుతూ స్థానికులు ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు కళ్లుండి చూడలేని స్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో పి.బుజ్జి, పి.చిన్న, భగత్ రవి, రాజు, వాసు, మురళి, రాము, బాల పాల్గొన్నారు.



చలి...పులి...!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఒక మనిషి వణుకుతున్నాడంటే అందుకు రెండు కారణాలు. ఒకటి చలి వల్ల, మరొకటి భయం వల్ల. యాదృశ్చికమేమో కానీ ఈ రెండు కారణాలు ఒకేసారి రావడంతో తిరుపతి వాసులు రేయింబవళ్లు తేడాలేకుండా వణుకుతున్నారు. వారం రోజులుగా జిల్లాలో చలితీవ్రత అధికంగా ఉంది. మరో పక్క అలిపిరి పరిసర ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల ప్రాంగణంలో పులి (చిరుత) సంచారంతో తిరుపతి వాసులు భయాందోళనలో ఉండటం గమనార్హం.

చలి పంజా

వాతావరణ మార్పుల వల్ల జిల్లాలో ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోయాయి. నెలకు ముందుకూడా 35 డిగ్రీల సెంటీగ్రేట్ నమోదు అయితే, గడిచిన వారం రోజుల్లో కేవలం 20 డిగ్రీల సెంటీగ్రేట్ నమోదవుతోంది. దీనికి తోడు వరుస తుపాన్ల కారణంగా ఆకాశం మొత్తం మేఘావృతమైంది. నల్లటి మబ్బులకు తోడు, మంచు కప్పేయడంతో పగటి పూట కూడా వాహనదారులు లైట్లు వేసుకుని నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సాయంత్రం ఐదు దాటితే చీకటిమయం అవుతోంది. ఉదయం 9 గంటలైనా తిరుపతి, పరిసరాల ప్రాంతాల్లో లైట్లు వీధిలైట్లు తప్పనిసరిగా వినియోగించాల్సిన పరిస్థితి. ఇక మారుమూల ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల పరిస్థితి, సముద్ర పరీవాహక ప్రాంతాలైన నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, తడ వంటి ప్రదేశాల్లో దీని తీవ్రత మరింత పెరుగుతోంది. పగటిపూట కూడా స్వెటర్లు వేసుకోవాల్సి వస్తోంది. పిల్లలు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లల తల్లులు పెరుగుతున్న చలిగాలులకు తట్టుకోలేకపోతున్నారు. 40 ఏళ్లు దాటిన వాళ్లలో ఎక్కువగా చలికి వణికి వణికి నడుమునొప్పులు, మోకాళ్ల నొప్పులు, మెడ, మోచేతులు, కడుపు నొప్పులు అధికంగా ఉంటున్నాయి. మూలిగేనక్కపై ఎలక్కాయపడ్డట్టు మరో రెండు రోజుల్లో ఇంకో తుఫాను రాబోతుంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరించడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. మరొక్కొసారి తుఫాను వస్తే పరిస్థితి ఏంటనేది ప్రతి ఒక్కరిలో ఉన్న గుబులు. రానున్న రోజుల్లో మరింత భారీ వర్షాలు, ఉష్ణోగ్రతలు సైతం తగ్గనుండడం, రాత్రిపూట కేవలం ఆరు డిగ్రీల సెంటీగ్రేట్‌కు పడిపోతాయన్న హెచ్చరికలు మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

పులిపంజా

ఒకపక్క చలితో అల్లాడుతున్న తిరుపతి వాసులకు కొత్తగా పులి సమస్య వచ్చిపడింది. గత మూడు రోజులుగా తిరుమలకు వెళ్లే ప్రధాన దారి అలిపిరికి అతిచేరువలో ఉన్న శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి చిరుత ప్రవేశించింది. సాయంత్రం ఆరు, ఏడు గంటల ప్రాంతంలోనే పొగ మంచులో చిరుతపులి తచ్చాడటాన్ని అనేక మంది విద్యార్థులు వర్శిటీ సిబ్బంది గమనించారు. దీంతో సాయంత్రం అయ్యిందంటే ఆ పరిసరాల వాసులకు కంటిమీద కునుకులేకుండా పోతుంది. అలిపిరికి సమీపంలో శేషాచల అడవులను ఆనుకుని శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం, రాష్ట్రీయ సంస్కృతి విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర అగ్రికల్చర్ కళాశాల, సైన్స్ సెంటర్, ఏపి టూరిజం కార్యాలయం, కళాశాల, ప్రముఖ కంటి వైద్యశాల అరవింద ఐ హాస్పిటల్, టాటా ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌వి క్యాన్సర్ ఆసుపత్రి వంటి ప్రధానమైనవి అన్ని అటవీప్రాంతానికి ఆనుకునే ఉన్నాయి. దీనికి తోడు, మదనపల్లి, వేలూరు, బెంగుళూరు, రాయచోటి, కడప వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధానమైన బైపాస్‌రోడ్డు కూడా అదే కావడంతో నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. చిరుత సంచారం చుట్టుపక్కల వాసుల్లో భయాందోళన కల్గిస్తోంది. గతంలో చిరుత, ఎలుగుబంట్లు, పులి సంచారం ఉండేది. తిరుమల నడక మార్గాన ఓ చిన్నారి చిరుత పంజాకు బలైనప్పటి నుంచి వన్యమృగాల సంచారంపై ఆందోళన తప్పడం లేదు. ఇప్పుడు తాజాగా విశ్వవిద్యాలయాల ప్రాంగాణంలోనే చిరుత తరుచూ సంచరిస్తుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు భయాందోళనకు గురవుతున్నారు. తిరుపతి వాసులు ఒక పక్క చలికి, మరో పక్క పులికి భయపడుతూ బిక్కు బిక్కు మంటున్నారు. అటవీ అధికారులు కనీసం పులినైనా త్వరగా బంధించి తిరుపతి వాసులను భయాందోళన నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు అటవీశాఖ సిబ్బంది సైతం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చలికథ దేవుడెరుగు కనీసం పులినుంచైన ప్రజలను అటవీశాఖ అధికారులు కాపాడతారని ఆశిద్దాం..!

ఘనంగా జగన్ జన్మదినోత్సవం

ప్రజాశక్తి -నారాయణవనం: నారాయణవనం చావడి వద్ద ఎంపిపి దివాకర్ రెడ్డి, సత్యవేడు వైసిపి ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అన్నాదురై, కిరణ్ కుమార్, అశోక్, ముని బాబు సర్పంచ్‌లు, వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెత్తుకుప్పం వైసిపి కార్యాలయం, నెమలిగుంటపల్లి , ప్రసన్న వెంకటేశ్వరపురంలలో కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎదురుగా మేకపోతును బలి ఇచ్చి రక్తాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవి బ్రహ్మానంద రెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, మాదాసు మురుగయ్య, సర్పంచులు విమాల్ రెడ్డి, గణపతి రెడ్డి, ఆరేపల్లి గోవర్ధన్, దేవరాజు రెడ్డి, బి నిరంజన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

అక్షయ క్షేత్రంలో వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు, మిఠాయిలు, బ్రెడ్స్‌ను ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు, యువజన నాయకులు మోహన్ రెడ్డి, ప్రదీప్ కుమార్, రాజశేఖర్ రెడ్డి ,ఓం ప్రకాష్ రెడ్డి ,అయ్యప్ప ,వెంకటేశం ,రాజకుమార్ ,హరినాథ్ రెడ్డి సూర్య నారాయణరెడ్డి , మధుసూదన్ , మహేంద్ర , శ్రీనివాసులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తిలో

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వైయస్సార్ విగ్రహం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండల వైసిపి కన్వీనర్ విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనియర్ ఆరణి విద్యా నాథరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు కార్యకర్తలు జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మేరీగ మురళీధర్ కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని విజయకుమార్ , బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి , సంపత్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి ,సునీల్ ,రాధా రెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.

సత్యవేడు: నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్, మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు బిరేంద్ర వర్మ, వైసిపి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, బెల్ట్ రమేష్, శ్రీనివాసులు రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, మస్తానమ్మ, మాజీ సర్పంచ్ గోవిందస్వామి, తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి రూరల్‌లో

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట వైసిపి విద్యార్థి సంఘం నాయకులు వి హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి ఆధ్వర్యం లో శనివారం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు. సుమారు 200 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జొన్నల గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముని కృష్ణారెడ్డి, కాటూరి ఎంపీటీసీ నెలటూరు రవి, బుచ్చినాయుడు కండ్రిగ సర్పంచ్ బూదూరు వెంకటమ్మ , ఉప సర్పంచ్ కె ఎం రాజా, భాస్కర్ రెడ్డి, బాల శేఖర్, తులసి, నాగూర్ నాయుడు, పెంచలయ్య, దయాకర్ యాకోబు తో పాటు భారీ సంఖ్యలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


బుచ్చినాయుడు కండ్రిగలో

కెవిబి పురం: మండల కేంద్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య ఎంపీపీ ముని లక్ష్మీ నందకుమార్ ఆధ్వర్యంలో.ముందుగా వైయస్ రాజ అనంతరం కేక్ కట్ చేసి సంబ రాలు జరుపుకున్నారు. .ఈ కార్యక్రమంలో వైసిపీ సీనియర్ నాయకులు లాల్ బాబు యాదవ్, దేరాల శ్రీనివాసులు, సుబ్బయ్య, అయ్యప్ప, గిరి, జాకీర్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నూక తోటి రాజేష్, తిరుపతి జిల్లా వైసీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ ఏలూరు రాకేష్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు మణి నాయుడు, రవి రెడ్డి గురునాథం, అజయ్ కుమార్ రెడ్డి, గురవయ్య ప్రసాద్ పాల ,జయచంద్ర నాయుడు, సాయి నాయుడు, ప్రసాద్ దేవదాస్ రెడ్డి, కోటేశ్వర్ నాయుడు, గోపాల్ రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

పెళ్లకూరు: చిల్లకూరు వైసిపి కార్యాలయంలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రెసిడెంట్ వెంకటరత్నం, ఎంపీపీ శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి:): వైసిపి చంద్రగిరి నాయకుల ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పట్టణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద భారీ కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసు నాయుడు పాల్గొన్నారు.

ఏర్పేడు : మండల వైసిపి అధ్యక్షులు కోనాటి రమణయ్య యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏర్పేడు సర్పంచ్ శివయ్య, వైస్ ఎంపీపీ జమ్ముల శ్రీనివాసులు, నాగార్జున రెడ్డి, బత్తి శెట్టి, ఏర్పేడు మండల సర్పంచులు, అభిమానులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తప్పి పోయిన వ్యక్తి బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మతిస్థిమితం లేకనో..కుటుంబ కలహాలతోనో.. శ్రీకాకుళం నుండి తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం దేవిపురం గ్రామానికి చేరుకున్న దుర్యోధన గర్గ (47)ను శనివారం చంద్రగిరి పోలీస్ కానిస్టేబుల్ దివాకర్ ఆధ్వర్యంలో బంధువులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా, మందాస మండలం, పిడి మందాస గ్రామానికి చెందిన దుర్యోధన గర్గ ఈనెల 13వ తారీఖున ఊరు నుండి బయలుదేరి చంద్రగిరి బైపాస్ రోడ్ కు చేరుకుని అక్కడినుండి నడిచి రామచంద్రపురం మండలం, ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో ఎవరిని ఎలాంటి సహాయం అడక్కుండా అనుమానపు వ్యక్తిగా చెట్టు కింద ఉండడంతో గ్రామస్తులు అతనితో మాట్లాడి ' ఏ ఊరు, ఎందుకు వచ్చేశావు...? సమస్య ఏమి...?' అని మాట్లాడుతుండగా అతనికి తన బంధువులు గుర్తు రావడంతో, గ్రామస్తులకు ఫోన్ నెంబర్ ఇచ్చి శనివారం ఉదయం ఫోన్ చేయించారు. దుర్యోధన గర్గ కోసం భార్య, బంధువులు చిత్తూరు, తిరుపతి లో వెతుకుతుండగా ఫోన్ రావడంతో గంటలో చంద్రగిరి పోలీసులను తీసుకుని పివిపురానికి చేరుకున్నారు. బంధువులను గుర్తుపట్టిన దుర్యోధన గర్గ వారి దగ్గరికి వెళ్లి కన్నీరు పెట్టుకున్నాడు. గ్రామస్తులు ఆ వ్యక్తిని చంద్రగిరి పోలీస్ కానిస్టేబుల్ దివాకర్ ఆధ్వర్యంలో భార్య, బంధువులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులందరికీ దుర్యోధన గర్గ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగ అరెస్ట్

ప్రజాశక్తి- డక్కిలి: దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో వున్నట్లు తెలిపారు. దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు బ్రహయ్యను డక్కిలి పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు సాయికుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు బ్రహయ్య నుండి ఆరువేల రూపాయలు నగదు, వెండి 299 గ్రాములు, బంగారం 21.790 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 19,8,500 రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. శనివారం వెంకటగిరి సిఐ కార్యాలయంలో సిఐ ఎవి రమణ విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ గత నెల 20వ తేదీ అర్ధ రాత్రి సమయంలో డక్కిలి మండలం, దగ్గవోలు గ్రామంలో తాల్లమ్మ గుడిలో గుర్తు తెలియని దొంగలు గుడి తలుపులు పగలగొట్టి లోపలి వెళ్లి హుండీని పగలగొట్టి అందులో ఉన్న కానుకల నగదును, అమ్మవారికి అలంకరించిన బంగారు, వెండి వస్తువులను దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు డక్కిలి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. తమకు వచ్చిన సమాచారంతో నిందితుడిని శుక్రవారం సాయంత్రం డక్కిలి మండలంలోని తెలుగు గంగ కాలువ, మాధవయ్య పాలెం గ్రామం వద్ద ఉండగా డక్కిలి ఎస్ఐ శివ శంకర్ రావు, సిబ్బంది కలిసి అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను గూడూరు డిఎస్పీ రమణ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పి మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. పలు రికార్డులు పరిశీలించి , కేసుల వివరాలు, పురోగతిపై ఆరా తీశారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఉత్సవాల్లో జడ్జి

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని సి రామాపురం (శ్రీ సిద్ధేశ్వర తీర్థం (బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమం)లో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాలలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సమీర్ గోపాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఆశ్రమానికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అష్టలక్ష్మి ఉత్సవాలలో ఆయన పాల్గొని మూడు గంటలపాటు అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి సమీర్ గోపాల్ కుటుంబ సభ్యులు, ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురువానంద గురూజీని కలిసి ఆశీర్వాదం స్వీకరించారు. అష్టలక్ష్మి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు అన్న ప్రసాదాలు అందించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-రామచంద్రపురం: గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని ప్రసన్న వెంకటేశ్వరపురంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదు అందించారు. 12 అర్జీలు స్వీకరించామని త్వరలో విచారించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎం తిరుమలరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బి విజయ్ కుమార్, కే త్యాగరాజులు, బాదూరు నరసింహారెడ్డి, రాజేష్ రెడ్డి, సుగుణ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అమృత, పంచాయతీ కార్యదర్శి రఠాని, వీఆర్వోలు గాలి గుణ భూషన్ నాయుడు, వెంకటరమణ, మల్లికార్జున, రాజశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నేత రమణయ్య మృతి

ప్రజాశక్తి- డక్కిలి: డక్కిలి మండలం కోత్తనాలపల్లి (తూర్పుపల్లి) కి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు కొత్తపు రమణయ్య(78)శనివారం మృతి చెందారు. రమణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సాయంత్రం అనారోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమణయ్య మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. డక్కిలి మండలంలో సీనియర్ నాయకుడు అయిన ఆయన తొలినుంచి నేదురుమల్లి కుటుంబం తోనే రాజకీయాలు సాగించారు. రమణయ్య మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.


రమణయ్య (ఫైల్‌ఫోటో)

ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్లపై అవగాహన

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని ఉదయమాణిక్యం గ్రామపంచాయతీలో వెలుగు ఏపీఎం తిరుమల రాజు ఆధ్వర్యంలో శనివారం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా డిఆర్‌డిఏ పీడీ శోభన్‌బాబు హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పండే పంటలు, చిరుధాన్యాలు, సమాచార సేకరణ, రైతులు జీవనోపాధి పై సూచనలు ఇచ్చారు. ఎఫ్‌పిజి మహిళా కిషాన్, ఐఎఫ్‌సి ఖాతాపైపై చర్చించి రైతుల ప్రశ్నలకు నివృత్తి చేసి వివిధ తీర్మానాలు చేశారు. కిసాన్ మహిళా గ్రూపులకు రూ.40 లక్షలు వరకు లోన్లు మంజూరైనట్లు ఏపీఎం తిరుమల రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నీలేష్‌కుమార్‌కు యంగ్ అచీవర్స్ అవార్డు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్ఆర్‌ఎం యూనివర్సిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టిఆర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ (అడ్మిన్) డాక్టరు పి రవి పచ్చముత్తు, డైరెక్టర్ పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎ రత్నం ఆధ్వర్యంలో యంగ్ అచీవర్ అవార్డును తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ తనయుడు కుప్పాల నీలేష్ కుమార్‌కు అందించారు. శనివారం చెన్నై ఎస్ఆర్‌ఎం యూనివర్సిటీ టీపీ గణేష్ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ వేడుకలు మహా వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ అతని నిర్మాణ వ్యాపారం , సామాజిక సేవ, ప్రస్తుత భవిష్యత్తు తరాలకు ప్రేరణగా ఉపయోగ పడుతుందన్నారు. 1991–2024 ఎస్ఆర్‌ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల బ్యాచ్‌కి ఇతర అవార్డులను అందించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి యువ సాధకుల అవార్డును అందుకున్న ఏకైక వ్యక్తిగా నీలేష్ కుమార్‌ను కొనియాడారు.

టీటీడీలో బంజారాలకు అవకాశం కల్పించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : బంజారాల సమస్యలు పరిష్కరించి టిటిడి పాలకమండలిలో వారికి అవకాశం కల్పించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శనివారం వినతి పత్రం అందించారు. శ్రీ స్వామి హథీరాంజీ బావాజీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బి.శివ నాయక్, తెలంగాణ అధ్యక్షులు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ శ్రీవారికి సేవ చేసిన హథీరాంజీకి తగిన గుర్తింపు తిరుపతి తిరుమలలో ఇవ్వడం లేదన్నారు. తమ సంఘం తరపున హథీరాంజీ ఆలయాన్ని నిర్మిస్తే అధికారులు కూల్చివేయడం అన్యాయమన్నారు. హథీరాంజీ మఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం వైస్ ప్రసిడెంట్ తుకారం రాథోడ్, జనరల్ సెక్రటరీ కె లక్ పతి నాయక్, సభ్యులు నీలాబాయి పాల్గొన్నారు.

వలస కార్మికులకు ఐరన్ బాక్సులు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సిర్డ్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో 40 మంది వలస కార్మిక కుటుంబాలకు తిరుపతి యూత్ హాస్టల్‌లో శనివారం ఎల్పిజి ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఎన్ శోభన్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ ఎల్పిజి ఇస్త్రీ పెట్టె సక్రమంగా వాడుకోవాలని, దీని వలన తక్కువ సమయంలో ఎక్కువ దుస్తులు ఇస్త్రీ చేయవచ్చు అన్నారు. డిఎస్పి మహిళా పోలీస్ శ్రీలత, తిరుపతి లేబర్ ఆఫీసర్ రాజయ్య, సోషల్ ఇంటిగ్రేటెడ్ రోల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి మరుపూర్ హేమ శేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్రొజెక్టర్ ప్రదానం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని మడిబాక గ్రామ పంచాయతీ రాజుల కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సృజన షాప్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత పాదిలేటి లక్ష్మీనారాయణ దంపతులు, కుమారుడు సృజన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు విరాళంగా 50వేల రూపాయలు విలువచేసే మిల్టన్ వాటర్ ప్రొజెక్టర్ అందించారు. టిడిపి సీనియర్ నాయకులు కడివెళ్ళ సాంబశివరాజు, సర్పంచ్ కడివెళ్ళ చంగల్ రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ మంజుల పాల్గొన్నారు.


31 లోపు ఓపెన్‌స్కూలు పరీక్షల ఫీజు చెల్లించాలి: డీఈవో

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ 10, ఇంటర్మీడియట్ 2024 మార్చి పరీక్షల ఫీజును ఈ నెల 31వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవియన్‌కుమార్ తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి 31వ తేదీ లోపు ఏపీ ఆన్‌లైన్‌లో ఆన్‌లైను పేమెంట్ గేట్‌వే ద్వారా ఫీజులు చెల్లించవచ్చునని తెలిపారు. 25 రూపాయల అపరాధ రుసుంతో జనవరి 1 నుంచి 4వ తేదీ లోపు, 50 రూపాయలు అపరాధ రుసుంతో జనవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పరీక్షల ఫీజును చెల్లించవచ్చని వివరించారు. జనవరి 9 నుంచి 10వ తేదీ వరకు తత్కాల్ ఫీజులు కింద ఇంటర్మీడియట్‌కు వెయ్యి రూపాయలు, పదవ తరగతికి రూ. 500 జరిమానాతో పరీక్ష ఫీజును చెల్లించ వచ్చుని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఏపీ ఓపెన్ స్కూలులో ప్రవేశం పొంది పదవ తరగతి రాయాలనుకున్న వారు 2024 ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్ రాయాలనుకున్న వారు పదవ తరగతి పాసై 15 సంవత్సరాలు వయసు నిండి ఉండాలన్నారు. గత సంవత్సరం ప్రవేశం పొందిన వారు కూడా పరీక్ష ఫీజు చెల్లించడానికి అర్హులని తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ అధ్యయ కేంద్రాల సమన్వయకర్తలు జనవరి 11వ తేదీ నామినల్ రోల్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

డిసిసి అధ్యక్షుడు బాల గురవం బాబు

ప్రజాశక్తి -నాగలాపురం: 2029 లో నిర్వహించనున్న ఎన్నికలలో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా, రాష్ట్రంలో షర్మిల రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని, ఎస్సి, ఎస్టీ, బిసి వర్గాలకు, విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తిరుపతి డిసిసి అధ్యక్షుడు బాల గురువం బాబు అన్నారు. నాగలాపురం మండల కేంద్రంలోని జైన్ బిల్డింగ్ లో ఆ పార్టీ మండల అధ్యక్షులు డాక్టర్ దామోదరం ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ సమావేశం శనివారం నిర్వహించారు ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గం మండలం జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతం కోసం మండల అధ్యక్షులు నియోజక వర్గ అధ్యక్షులు జిల్లా కమిటీ సభ్యులను నియమిస్తున్నామన్నారు. 4200 మంది స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను తొలగిస్తే షర్మిల రెడ్డి కార్మికులకు అండగా నిలిచి ఆ సంస్థ యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేయడంతో వెంటనే ఆ కార్మికులను విధుల్లోకి తీసుకున్నారన్నారు. 2029 ఎన్నికల్లో షర్మిలారెడ్డిని ముఖ్యమంత్రి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయడానికి మొదలు పెడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు బాల గురువం బాబు

భూ ఆక్రమణ సమస్యను పరిష్కరించండి

రెవెన్యూ సదస్సులో సిపిఎం వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బొజనత్తంలో భూ ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు తహశీల్దారుకు విన్నవించుకున్నారు. పట్టణంలోని 24వ వార్డు ఈసలాపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సిపిఎం పుత్తూరు కార్యదర్శి ఆర్ వెంకటేశు దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య గ్రామస్తులతో కలిసి ఎస్‌టి కాలనీ భోజనత్వంలో భూ ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని మండల తహశీల్దారు జి వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహశీల్దారు స్పందించి ఆ గ్రామంలో భూ ఆక్రమణపై సర్వే నిర్వహించి హద్దులు ఏర్పా టు చేస్తామని, ఇల్లు లేని నిరుపేదలకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. భోజనత్వం గుంత సర్వేనెంబర్ 44/5 ఆక్రమ ణకు గురైందని, దాన్ని కూడా సర్వే చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధరం, సుబ్రహ్మణ్యం, చంగయ్య వల్లెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.


తహశీల్దారుకు సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

గంగా ప్రసాద్‌పై అసత్య వార్తలు తగదు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టీడీపీ నేత గంగా ప్రసాద్ పై ఓ పత్రిక అసత్య వార్తలు రాయడం సమంజసం కాదని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాళ్లను ఎమ్మెల్యేలుగా చేసిన మంచి వ్యక్తి గంగా ప్రసాద్ అని కొనియాడారు. వైసిపి హయాంలో సహజ వనరులను దోచుకున్నారని ఎద్దేవా చేశారు. ఇసుక వ్యాపారం చేయాల్సిన దుస్థితి గంగా ప్రసాద్‌కు లేదని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు కథనాలు, వార్తలు రాస్తే పత్రికపై చట్ట పరమైన చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

బాల మేధావులుగా రాణించాలి

'వీక్ష ది' కరస్పాండెంట్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : గణితంపై పట్టు సాధించి బాల మేధావులుగా రాణించాలని వీక్ష ది స్కూలు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. వీక్ష పాఠశాల ఆవరణలో ముందస్తుగా జాతీయ గణితం దినోత్సవం సెలబ్రేషన్స్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు మ్యాథమెటిక్స్ ప్రత్యేకతను వారు చార్టు ద్వారా వివరించారు. పిల్లలు అన్ని సబ్జెక్టులపై శ్రద్ధతో, ఉపాధ్యాయులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకుని గణితంపై పట్టు సాధించి బాల మేధావులుగా రాణించాలని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తాతి రెడ్డి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మిట్టపల్లి విమల మాట్లాడుతూ తాము చిన్నతనంలో పాఠశాలలో కూడికలను, తీసివేతలు, గుణకారంను మొదలైన గణిత సూత్రాలను ఉపయోగించి అవలీలగా గణిత సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్ ప్రపంచ దేశాల్లో గుర్తింపు తెచ్చుకున్నారని, నేటితరం పిల్లలు శ్రీనివాస రామానుజన్, శకుంతల దేవి, ఆర్యభట్ట, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఉపాధ్యాయ వృత్తికి వెన్ను తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహోన్నతుల్లా తయారు కావాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో శశి యాదవ్, అమిటి డిప్యూటీ మేనేజర్ రమేష్ రెడ్డి, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వీక్ష ది స్కూలు పాఠశాల కరస్పాండెంట్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి

గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా నేషనల్ మ్యాథమెటిక్స్ డే ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకురాలు కిరణ్మయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ నారాయణ రాజు, శ్రీధర్ శర్మ, డాక్టర్ పీర కుమార్, డాక్టర్ విజయ మహేష్, రవిరాజు, లక్ష్మి, మైమూన్, శైలజ, హిమబిందు, అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే సహించం: వైసిపి

ప్రజాశక్తి- వెంకటగిరి: వైసిపి కార్యకర్త తంగా పేచీ రాజుపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం సమంజసం కాదని వెంకటగిరి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎన్‌జెఆర్ భవనంలో శనివారం విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలపై కక్ష సాధింపు చర్య లకు పాల్పడడం సరికాదన్నారు. పేచి రాజు అరెస్టుకు కారణాలను పోలీసులు తెలపకుండా ఉంచడం, పోలీస్ స్టేషన్‌కి తమ కార్యకర్తలను, కుటుంబ సభ్యులను రానివ్వకుండా అడ్డుకోవడం సరికాద న్నారు. పెచీ రాజ్ చేసిన నేరమేమిటో చెప్పాల్సిన అవసరం పోలీసులకు ఉంద న్నారు. పేచీరాజు అరెస్టుపై పోలీసులు వ్యవహరించిన తీరును ఎస్పీ, డీజీపీ, హ్యూమన్ రైట్స్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. వైసిపి కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిం చాలని చూస్తే ఎవరిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. చేశారు. పోలీసు లు చేసిన వ్యవహార శైలికి ఉన్నత అధికారులకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి కార్య కర్త ల కు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ నాయకులు బాలయ్య, రాజారెడ్డి, కల్యాణి పాల్గొ న్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు రామ్‌కుమార్‌రెడ్డి

టిప్పర్లపై పోలీసుల కొరడా

పలు వాహనాలపై జరిమానా

ప్రజాశక్తి - సత్యవేడు: ఓవర్ లోడింగ్‌తో వెళుతున్న టిప్పర్ల పై స్థానిక పోలీసు అధికారులు కొరడా ఝుళిపిం చారు. ఇందులో భాగంగానే శనివారం స్థానిక సిఐ మురళి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కంకర, డస్ట్ వంటి సరుకులను బాడీ లెవెల్ కంటే మితిమీరి వేసుకొస్తున్న టిప్పర్లను గుర్తించి వాటికి జరిమానా విధించారు. సీఐ మురళి మాట్లాడుతూ అధిక టన్నేజ్ తో రోడ్డు కంకర, డస్ట్ రవాణా చేయ డానికి అనుమతించబోమని తెలిపారు. ప్రతి టిప్పరు బాడీ లెవెల్‌కు మాత్రమే సరుకు తరలిం చేందుకు అనుమతి వుందన్నారు. రోడ్డు నిబంధనలను టిప్పర్ వాహన దారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి అధిక టన్నేజ్‌తో తరలిస్తే చట్టపర చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ మురళి

అర్ధరాత్రి అగ్నిప్రమాదం

తృటిలో తెప్పిన ప్రాణ నష్టం

ప్రజాశక్తి-నాయుడుపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో అగ్ని మాపక అధికారులు సకాలంలో మంటలు అదుపు చేయడంతో ప్రాణ నష్ట ప్రమాదం తప్పిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. నాయుడుపేట ఎస్‌కేఎల్ఎస్ పెట్రోల్ బంక్ పక్కన వాటర్ సర్వీస్ సెంటర్లో అర్ధరాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సకాలంలో అగ్నిమాపక శాఖ మంటలు అదుపు చేయడంతో ప్రాణం నష్టం తప్పింది. నెల్లూరు చెన్నై హైవే మల్లాం కూడలి వద్ద ఉన్న ఎస్ కే ఎల్ ఎస్ పెట్రోల్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర వైన్స్ పక్కన ఉన్న వాటర్ సర్వీస్ సెంటర్లో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే భారీ స్థాయిలో మంటలు చెలరేగడంతో విద్యుత్ తీగలు సైతం కాలిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు రాత్రి తీవ్ర ఆందోళన చెందారు.

సన్న యూరియా కొరత తీర్చండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైతుల అవసరాలకు తగ్గట్లుగా సన్నరకం యూరియాను అందుబాటులో ఉంచాలని తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాలు ఆగడంతో రైతులు పంటలకు ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. అయితే సన్న యూరియా లేకపోవడం వల్ల కలుపు మందులు, గుళికలు, పాస్పెట్, సల్ఫేట్, పొటాష్, క్రిమిసంహారక మందులు కలపడం వీలుకావడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు సన్నరకం యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి లోకల్ బ్రాంచ్, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహనను శ్రీనివాస ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్త, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు నరసింహారావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చేసే అనేక రూపాలను, ప్రజలు వారి సైబర్ నేరాల బారిన ఎలా పడతారు? వివరించారు. విద్యార్థులకు ఆయన సూచనలిస్తూ, స్మార్ట్ ఫోన్ల భద్రత, వాట్సాప్ వినియోగం, ఇ మెయిళ్ళు, అనేక ఇతర యాప్‌లపై తీసుకోవలసిన భద్రతా చర్యల గురించి మొబైల్‌లో అనుభవ పూర్వకంగా అందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం భూపతి నాయుడు మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న రోజుల్లో సైబర్ భద్రత ప్రధాన సమస్యగా మారిందన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిబి మురళీధర్ ఇటీవల తన పరిసరాల్లో నిర్వహించిన మూడు సైబర్ క్రైమ్‌లు, ప్రత్యక్ష కేసులను వివరించారు. విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఐఐపీఏ తిరుపతి స్థానిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమ వివరాలను ఈ కార్యక్రమ నిర్వహ ణకు నాయకత్వం వహించిన తిరుపతి స్థాని క శాఖ కార్యదర్శి ప్రొఫెస ర్ డి కృష్ణమూర్తి తెలిపా రు. విద్యార్థుల్లో ముఖ్యం గా బాలికా విద్యార్థుల్లో డిజిటల్ అవగాహన అవ సర మని కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ తిరుపతి స్థానిక శాఖ ఛైర్ పర్సన్ ప్రొఫెసర్ టి.లక్ష్మమ్మ, డా.శమంతకమణి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం. ప్రయాగ, ఐఐపీఏ సీనియర్ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎం. నాయుడు, ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, డాక్టర్ పి.వివేక్, వర్సిటీ సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అతిథులకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు


బస్టాండును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

బస్టాండ్ అభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆయన శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సముదాయాన్ని తనిఖీ చేశారు. ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణికులకు కనీస వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రితో ఫోన్ లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్

ప్రజాశక్తి -ఏర్పేడు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని , వీటిని సద్వినియోగం చేసుకోవాలని మడిబాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కడివెళ్ల చెంగల్ రాజు తెలిపారు. యండి పుత్తూరులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిటి, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్, పిఎస్, ఎండి పుత్తూరు సర్పంచ్, మడిబాక పంచాయతీ క్లస్టర్ గుండ్రాజు మురళి పాల్గొన్నారు.

హెల్మెట్‌లు ధరించాలి: సీఐ

ప్రజాశక్తి- ఏర్పేడు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ప్రతి ఒక్కరూ ధరించాలని ఏర్పేడు సీఐ జయచంద్ర శనివారం సాయంత్రం ఏర్పేడులో వెంకటగిరి సర్కిల్ వద్ద వినూత్నంగా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జయచంద్ర మాట్లాడుతూ 'తల మీదే – రక్షణ మీదే అని, ఒక తల పోతే రెండో తల పొందలేరు నాలాగా అని వినాయకుడి పోస్టర్ పెట్టి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని లేని పక్షంలో భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మొదటిసారి హెచ్చరించి రెండవ సారి దొరికితే లైసెన్స్ కూడా రద్దు చేస్తామని ప్రచారం చేశారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని, కుటుంబాలు రోడ్డు పాలు అవుతాయని అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు.

అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే నిందలా?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ అరాచక, అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే నిందలు వేయడం ఏమిటని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడు తూ తనపై వేసిన నిందలు కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా రాజీవ్ నగర్ కాలనీలో వైసీపీ అక్రమ కట్టడాలను తొలగింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేసి ఆదాయాన్ని గణనీయంగా పెంచుతూ వస్తున్నామని తెలిపారు. స్వర్ణముఖి నది ఒడ్డున రోడ్డును ఆక్రమించి చేసిన కట్టడాల తొలగింపునకు శ్రీకారం చుట్టితే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హంగామా సృష్టించి అధికారులపై బూతు పురాణంతో చిందులేసిన ఘటనపై కేసు కూడా నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. దక్షిణ కైలాసనగర్ లో మాజీ ఎమ్మెల్యే బావమరిది దౌర్జన్యంగా ఆక్రమించుకున్న భూమిని

ఎమ్మెల్యే
బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



సంబంధిత వ్యక్తులకు ఇప్పించిన విషయాన్ని తెలిపారు. రేణిగుంట మండలంలో ఏకంగా 142 అక్రమ కట్టడాలను ఒకే రోజు తొలగించామని చెప్పారు. ఇవేకాకుండా మున్సిపల్ పరిధిలో పలు అక్రమ కట్టడాలను గుర్తించామని అయితే ఇది వరకు పనిచేసిన కమిషనర్ రమేష్ బాబు వారిని జాగ్రత్త పరచి కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. దీనివల్ల ఆ అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆగిందన్నారు. వైసీపీ ఆక్రమాలను ఏ ఒక్కటీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.



పరిశోధనల ప్రాజెక్టులపై ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎస్‌వియు విసి అప్పారావు

అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టొయామా ప్రిఫెక్చర్, జపాన్ సంస్థ శనివారం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. విజయవాడలో నిర్వహించిన ఈ ఒప్పందంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భాగస్వామ్యం అయ్యింది. ఇందులో విద్య – పరిశోధనలలో సహకారం, విద్యార్థి – అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టుల నిర్వహణ వంటి కీలక రంగాలపై సహకారాన్ని అందించుకోనున్నాయి. ఈ అవగాహన ఒప్పందంలో వర్సిటీతో పాటు ఆంధ్ర, నాగార్జున వర్సిటీలతో మాత్రమే భాగస్వామ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ తరపున ఉప కులపతి ఆచార్య అప్పారావు, పరిశోధనాభివృద్ధి డీన్ ఆచార్య జి.నరసింహ, జంతుశాస్త్ర అధ్యాపకుడు ఎం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయలోని కేంద్రీయ గ్రంథాలయంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ప్రధాన అధికారి ఆచార్య కొంగర సురేంద్ర బాబు మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి ఏకాగ్రత పెరిగి పోటీలలో విజయ వకాశాలు సాధ్యపడుతుందని, విద్యార్థులు కొంత సమయాన్ని ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. పతాంజలి యోగ సమితి, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యానం ఆవశ్యకత, ధ్యాన విధానాన్ని నేర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ యోగ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ధ్యానంపై మూడు రోజుల అవగాహన, శిక్షణ శిబిరం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి ధ్యానాన్ని ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితం కోసం ఒక మార్గంగా అందరికీ అవగాహన కలిగించాలని, ప్రతి ఒక్కరికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ధ్యానంలో ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ లక్ష్మీ నారాయణ, జానకిరామ్, బలిచక్రవర్తి, జ్ఞాన రంజన్, జగన్నాథ్, వేణు ప్రకాష్, టి శివకుమార్, లోకేశ్వర్, రాహుల్ శర్మ, యోగ విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ధ్యానం ధ్యానం వల్ల శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుందని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బి. చంద్రమౌళి తెలిపారు. ధ్యానం వల్ల మానవాళికి ప్రశాంతమైన మనస్సు, మంచి ఏకాగ్రత తకి ఇస్తు నొపి – రోగనిరోధక శక్తి, అంతర్గత శక్తులు పెరుగుతాయని, అలాగే అధిక రక్తపోటు, తలనొప్పి, నిద్రలేమి, టెన్షన్లు, అల్సర్లు మొదలైనవి తగ్గుతాయని అన్నారు.. ఈ కార్యక్రమంలో మన్యం నరసింహులు, జి. తిరుమలయ్య , సురేష్ బాయి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని న్యాయ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: టిఎన్‌ఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌వియూ పరిధిలో బార్ కౌన్సిల్ అనుమతి లేని న్యాయ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్కే నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకి ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ లా సెట్ మొదటి వెబ్ ఆప్షన్‌లో కేఎంఆర్ లా కాలేజ్, రాయలసీమ లా కాలేజీ, ఈశ్వర్ రెడ్డి లా కాలేజీ లకు బీసీఐ, యూనివర్సిటీ అథారిటీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. కానీ రెండవ వెబ్ ఆప్షన్‌లో ఈ న్యాయ కళాశాలలకు యూనివర్సిటీ అధికారులు ఎలా పర్మిషన్ ఇస్తారు? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కళాశాలలపై అనేక ఆరోపణలు ఉన్నాయని, 'ఏపీ లా సెట్' మొదటి కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా ద్వారా సీట్లు పొందిన విద్యార్థులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ అండ్ రెగ్యులేషన్ అనే పేరుతో ఈ కళాశాలలో అలాట్మెంట్ ఇవ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తూ అడ్మిషన్ పొందిన విద్యార్థులను తిరిగి వెనకకు పంపిస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అక్టోబర్ 2024లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రతి విద్యార్థి హాజరును బయోమెట్రిక్ తో పాటు లా విద్యార్థులకు సంబంధించిన క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ సర్టిఫికెట్లు సేకరించాలనే నిబంధనను ఉల్లంఘిస్తూ ప్రతి లా కళాశాలలో 10 శాతం కన్వీనర్ కోటా సీట్లను మాత్రమే తీసుకుని మిగతా 90 శాతం సీట్లను మేనేజ్‌మెంటు కోటా సీట్లుగా మార్చుకుని తమిళనాడు, కేరళ ఇతర రాష్ట్రాల విద్యార్థుల నుంచి లక్షలకు లక్షలు దండుకొని అమ్ముకుంటు న్నారన్నారు. కన్వీనర్ కోటా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంవత్సరానికి ఫీజు రూ.15, 000 ఫీజు అయితే అదనంగా వసూలు చేయడం వల్ల కన్వీనర్ కోటలో సీట్లు పొందిన విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన వైవాలో పెద్ద మొత్తంలో విద్యార్థుల నుండి వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, వారిపై వర్సిటీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు భీష్మ, రాజు, పెద్దయ్య, ప్రకాష్, రామలింగ, సోమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవంలో మాజీ మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక. మున్సిపాలిటీ పరిధిలో గేట్ పుత్తూరులో పుత్తూరు ముస్లిం మైనారిటీ లతో కలిసి గంధపు ఉత్సవ కలశాలను ఊరేగింపులో తీసుకువెళ్లి నాగూరు ఖాదర్ వలి గంధపు మహోత్సవంలో దర్గాలో ముస్లిం మైనారిటీల ద్వారా పూజల నిర్వహించి ఉత్సవాలలో మాజీ మంత్రి శనివారం సాయంత్రం పాల్గొన్నారు. గేట్ పుత్తూరు స్థానిక ముస్లిం నాయకులు, ప్రజలు అంగరంగ వైభవంగా బ్యాండు మేళాలు, బాణా సంచాలతో, గజమాలతో మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆర్‌కెరోజా గేట్ పుత్తూరు దర్గాలో ప్రతి సంవత్సరం నాగూరు ఖాదర్ వలి దర్గాలో ఇస్లాం సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహీన్, మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ శంకర్, జయప్రకాష్, మసీదు పెద్దలు సాహెబ్ ఇలియాస్ యూసఫ్ సాహెబ్ ఖాదర్ సాహెబ్, ముస్లిం సోదరులు, మునిసిపల్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గంధ మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా